## క్లుప్తంగా

### ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 28, 29న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల డీసీవో బాలరాజు తెలిపారు. ఎంఈసీ, సీఈసీ, ఎంపీసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ చేయనున్నారని, అర్హులైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో నేరుగా హాజరుకావాలని సూచించారు.

### 'బాధ్యులపై చర్యలు తీసుకోవాలి'


మాట్లాడుతున్న ఆనందరావు

కెరమెరి: ఉపాధిహామీ పథకంలో జరిగిన పనులపై నిర్వహించిన ప్రజా వేదికలో బయటపడ్డ అవకతవకలకు సంబంధించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్‌రావు అన్నారు. లక్షల రూపాయల అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం అధికారులు తెలిపినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. శ్యాంరావు, సంతోష్, నాగోరావు, భీము, గణపతి తదితరులు ఉన్నారు.

### దివ్యాంగులకు కొత్త పింఛన్ పంపిణీ


పింఛన్ అందజేస్తున్న సర్పంచ్

కెరమెరి: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పెంచిన కొత్త పింఛన్ రూ. 4016ను శనివారం లబ్ధిదారులకు అందజేసినట్లు సాంగ్వి గ్రామ పంచాయతీ సర్పంచ్ తొడొసం జగన్నాథ్‌రావు తెలిపారు. ఆయన వెంట బీపీఎం మహేశ్ ఉన్నారు.

### ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతం

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లో గల శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో శనివారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ వ్రతం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

### హనుమాన్ ఆలయంలో ఎక్కాహం

ఆసిఫాబాద్‌అర్బన్: పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ హనుమాన్ ఆలయంలో భక్తిశ్రద్ధలతో 24 గంటల పాటు ఎక్కాహం కార్యక్రమాన్ని చేపట్టారు. అర్చకుడు అభయ్‌కుమార్ ఆచార్య ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, మంగళహారతి, మహా మంత్రపుష్పాన్ని నిర్వహించారు. ఆదివారం ముగింపు సందర్భంగా తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా సాధికారిత అధికారి రాణి అన్నారు. శనివారం మండలంలోని బూర్గుడలో మహిళ డిగ్రీ గురుకుల కళాశాలలో మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు వాణిజ్య, క్రీడా, ఉద్యోగ రంగాలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సాధికారత కేంద్రం సభ్యుడు సాగర్, ప్రిన్సిపాల్ దివ్య రాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అడవిపంది దాడిలో ఎద్దు మృతి


ఎద్దు వద్ద రోదిస్తున్న రైతు

కౌటాల: మండలంలోని తాటిపెల్లి గ్రామానికి చెందిన రైతు నౌగడె వత్తు –శోభ దంపతులు శనివారం ఉదయం గ్రామ శివారులోని చేనుకు వెళ్లారు. తమ రెండెద్దులను సమీపంలోని ఓ చెట్టుకు కట్టివేయగా మేత మేస్తున్న ఓ ఎద్దుపై ఒక్కసారిగా అడవిపంది దాడి చేసింది. దీంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. గతేడాది అప్పు చేసి మరీ ఎడ్లను కొనుగోలు చేశామని ఎద్దు మృతి చెందడంతో రూ.50వేల నష్టం వాటిల్లిందని వారు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతు కోరాడు. సంఘటన స్థలాన్ని ఎఫ్‌బీవో ప్రభాకర్ పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

# ఉత్సవంగా 'కోటి వృక్షార్చన'


చింతలమానెపల్లిలో హరితహారం నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

కెరమెరి: కోటి వృక్షార్చన ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 32,150 మొక్కలు నాటినట్లు ఎంపీడీవో మహేందర్, ఏపీవో మల్లయ్య తెలిపారు. ఆయా పంచాయతీల్లోని జీపీల్లో, ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో, హరితవనాల్లో, అవెన్యూ ప్లాంటేషన్‌లలో మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హట్టి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, మోడి ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీవో సుదర్శన్, ఎఫ్ఆర్‌వో మజారోద్దీన్, హెచ్ఎంలు ఆడే ప్రకాశ్, రమేశ్, ప్రేంసింగ్, ప్రేందాస్, ఎఫ్‌బీవో రామయ్య, ఏపీఎం జగదీశ్వర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

దహెగాం: నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని ఎంపీపీ కంబగౌని సులోచన అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో మొక్కలు నాటారు. జాతీయ జెండాలతో గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. మండలంలోని గెర్రె గ్రామంలో ఎంపీపీ మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అడవుల విస్తీర్ణం పెంచడానికి హరితహారం కార్యక్రమం చేపడుతోందన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో చిన రాస్పెల్లి ప్లాంటేషన్‌లో డీఆర్వో శ్రీధర్ చారి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్, సర్పంచులు సందికట్ల రమేశ్, బండ క్రిష్ణమూర్తి, ఏపీఎం చంద్రశేఖర్, అటవీశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): హరితహారం కార్యక్రమంలో భాగంగా శనివారం సిర్పూర్(టి) గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శ్మశానవాటికలో మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణకు పాటుపడాలని సూచించారు. మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. మండలంలోని డోర్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపీపీ చునార్కర్ సువర్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ తఫీమా పర్వీన్, ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్, ఎస్సై రమేశ్, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీవో రాంమోహన్, ఏపీఎం దుర్గయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఈవో కృష్ణమూర్తి, ఉపాధిహామీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

జైనూర్: చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని రాశిమెట్ట బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పార్వతిబాయి అన్నారు. శనివారం స్వతంత్ర్య భారత వజ్రోత్సవ కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులతో కలిసి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సర్పంచ్ గిరిజాబాయి, సయ్యాజీ పంచాయతీ కార్యదర్శి మారోతి, టీఏ రాజలింగు, అంగన్‌వాడీ టీచర్ గోదావరి, ఆశ కార్యకర్త అనసూయ పాల్గొన్నారు.

కౌటాల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమురం మాంతయ్య అన్నారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా శనివారం కౌటాల పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటారు. కౌటాల గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు హరితహారం ర్యాలీ తీశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో, మండలంలోని కౌటాల –బెజ్జూర్ ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎస్సై మధుకర్, ఎంపీవో మౌనిక, ఏపీవో పూర్ణిమ, సర్పంచులు మౌనిశ్, శంకరమ్మ, పంచాయతీ కార్యదర్శులు సాయికృష్ణ, కవిత, కోఆప్షన్ సభ్యులు అజ్మత్ అలీ, నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, సంతోష్, గట్టయ్య, నాహిం, ప్రభాకర్‌గౌడ్, శైలజాగౌడ్ పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం కోటి వృక్షార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, రెబ్బెన సీఐ అల్లం నరేందర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ అహల్యాదేవి, ఎంపీటీసీ మధునయ్య, ఎంపీవో అంజద్‌పాషా, ఏపీఎం రాజ్‌కుమార్, ఏపీవో బుచ్చన్న, కోఆప్షన్ సభ్యుడు జహురోద్దీన్, పంచాయతీ కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


రెబ్బెన: ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సీఐ

వాంకిడి: ప్రకృతిలో నెలకొంటున్న వైపరీత్యాల దృష్ట్యా మొక్కలు నాటితేనే భావితరాలకు మనుగడ ఉంటుందని ఎంపీపీ ముండె విమలబాయి అన్నారు. స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎంపీవో శివకుమార్, ఎస్సై సాగర్, ఏపీవో శ్రావణ్ కుమార్, సర్పంచ్ తుకారాం, కళాశాల అధ్యాపకులు, బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిర్యాణి: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి అన్నారు. ఒకరోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని గడలపెల్లి గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుణవంత్‌రావు, ఎంపీడీవో సత్యనారయణ సింగ్, ఎంపీవో జావిద్, ఫారెస్టు డిప్యూటీ రేంజర్ శ్రీనివాస్, ఎంపీవో షాకిర్ ఉస్మాని, ఏపీఎం సదానందం తదితరులు ఉన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని దర్గపల్లి బృహత్ ప్రకృతివనంలో కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అధికారులు 1000 మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీటీ సరిత, ఎంపీడీవో గంగాసింగ్, ఏపీవో సతీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మొక్కలను నాటడమే కాదు అవి వృక్షాలుగా మారే వరకు సంరక్షించాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. శనివారం మండలంలో వజ్రోత్సవ వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా హరితహారం నిర్వహించారు. మండలంలోని బాలాజీ అనుకోడ, అడెపల్లి, ఖర్జవెల్లి, గూడెం, చింతలమానెపల్లిలలో మొక్కలు నాటారు. జెడ్పీటీసీ శ్రీదేవి, ఎంపీవో సుధాకర్ రెడ్డి, ఏపీవో గోవర్ధన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.


కెరమెరి: మోడిలో మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు


తిర్యాణిలో..


కౌటాల: మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

### నిరుపేద విద్యార్థినికి చేయూత

కాగజ్‌నగర్‌టౌన్: స్థానిక బాలాజీనగర్‌కు చెందిన కె. రవళిక అనే పేద విద్యార్థినికి శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆర్థిక సాయం అందించా రు. రవళిక సిద్దిపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం పూర్తి చేసి రెండో సంవత్సరంలో చేరగా, ఆమెకు హాస్టల్ ఫీజు కింద రూ. 24,000 అందజేశారు. మొదటి సంవత్సరం హాస్టల్ ఫీజు కూడా గతంలో ఎమ్మెల్యే అందించారు.

### డిగ్రీలో చేరడానికి చివరి అవకాశం

కాగజ్‌నగర్‌టౌన్: ఇంటర్ ఉత్తీర్ణులై ఇప్పటి వరకు డిగ్రీలో చేరని విద్యార్థులకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం తెలిపారు. ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు విద్యార్థులు దోస్త్‌లో నమోదు చేసుకొని డిగ్రీలో ప్రవేశాలు పొందవచ్చన్నారు. వివరాలకు 9440194179 నంబర్‌పై సంప్రదించాలని ఆయన సూచించారు.

### నేడు బీజేపీలో చేరనున్న లెండుగురె శ్యాంరావు

కాగజ్‌నగర్‌టౌన్: మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతగూడ గ్రామానికి చెందిన లెండుగు రె శ్యాంరావు తన అనుచరులతో కలిసి ఆదివారం ఖమ్మంలో జరుగుతున్న రైతు గోస బీజేపీ భరోసా సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమక్షంలో బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

### 'చిల్లర రాజకీయాలు మానుకోవాలి'

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ పేపర్ మిల్లు కాంట్రాక్టు కార్మికుల అంశాన్ని కొందరు రాజకీయం చేసేందుకు యత్నిస్తున్నారని, అలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు బానయ్య, తాజ్, మహబూబ్, రవిలు స్పష్టం చేశారు. శనివారం మిల్లు గేట్ ఎదుట వారు విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై నిత్యం స్పందిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్పపై పలు పార్టీల నాయకులు అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. కాంట్రాక్టు కార్మికుల డబ్బుల చెల్లింపుపై నిరాధారమైన ఆరోపణలు చేయవద్దని సూచించారు.

# భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన


దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని ముత్తంపేట్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ దుద్దిళ్ల మనోహర అవధాని ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో శ్రీ శివ, ఆంజనేయ, వెంకటేశ్వర, మహాగణపతికి నవగ్రహ, శివ పంచాయాతయన, సాయిబాబా ధ్వజ శిఖర యంత్ర స్థిర ప్రతిష్ఠించారు. అనంతరం బలి ప్రదానం పూర్ణాహుతి, మంత్రపుష్పం, భక్తులకు మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదే శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షుడు బోనగిరి ప్రకాశ్, సభ్యులు కస్తూరి సత్యనారాయణ, దోని అంజన్న, గాదె శంకర్, రమేశ్, రవి, భక్తులు పాల్గొన్నారు.

# 'సమగ్రశిక్ష' ఉద్యోగులకు భద్రత కల్పించాలి

సిర్పూర్(టి): జిల్లాలో సమగ్రశిక్షలో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కేజీబీవీ ఎస్‌వో నాగసుధ, పీఆర్‌టీయూ టీఎస్ సంఘం నాయకులు జావేద్, జాడి దేవాజి, పురుషోత్తం, సమగ్రశిక్ష ఉద్యోగ సంఘం నాయకులు సుజాత, ప్రశాంత్, ప్రకాశ్, రమేశ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నిరసనలు విజయవంతం చేయండి**

వాంకిడి: జిల్లా కేంద్రంలో నిర్వహించే సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీఎస్ఎస్‌యూఎస్ సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లతో ఈ నెల 28, 29, 30వ తేదీల్లో జిల్లా కేంద్రంలో నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు విజయలక్ష్మి తెలిపారు. సంఘం మండల అధ్యక్షురాలు శ్రుతిక, ప్రధాన కార్యదర్శి తిరమల, కోశాధికారి శైలజ, నాయకులు సందీప్, సునీల్, విజయబాబు తదితరులు ఉన్నారు.

### మినీ జాబ్ మేళా

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించగా, జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి ఐటీఐ, నర్సింగ్, డిగ్రీ తదితర అర్హత ఉన్న అభ్యర్థులు హాజరయ్యారు. 54 మంది నిరుద్యోగులు హాజరు కాగా, 14 మందిని ఎంపిక చేసినట్లు ఉపాధి కల్పన అధికారి రవి పేర్కొన్నారు.

### కేర్ టేకర్లను నియమించాలి

కాగజ్‌నగర్‌టౌన్: కేజీబీవీ విద్యాలయాల్లో ప్రభుత్వం కేర్ టేకర్లను నియమించాలని పీఆర్‌టీయూఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. శనివారం ఆర్ఆర్‌వో క్యాంపు కేజీబీవీ విద్యాలయంలో పీఆర్‌టీయూఎస్ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

### భిక్షాటనతో నిరసన తెలిపిన 2వ ఏఎన్ఎంలు


భిక్షాటన చేస్తున్న 2వ ఏఎన్ఎంలు

ఆసిఫాబాద్‌అర్బన్: 2వ ఏఎన్ఎంలు తమను రెగ్యులర్ చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన సమ్మె శనివారం 11వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో వ్యాపార సముదాయాల వద్ద భిక్షాటన చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ 2వ ఏఎన్ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లను వెంటనే రద్దు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేంత వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దివాకర్, దుర్గం రవీందర్, రాష్ట్ర నాయకులు వసంత, సంతోషి, పుణ్యవతి, రజిని, భూదేవి, ప్రమీల, లక్ష్మి, సరస్వతి, తిరుమల, లీల, రాధ, రాజేశ్వరి పాల్గొన్నారు.

# పోలంపల్లి రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- రెండేళ్ల క్రితం నిధులు మంజూరు
- కంకర పోసి వదిలేసిన వైనం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


నిలిచిన పోలంపల్లి రోడ్డు పనులు

దహెగాం: మండలంలోని పోలంపల్లి గ్రామానికి రెండేళ్ల క్రితం బీటీ రోడ్డు మంజూరు కాగా ఇంతవరకు పనులు పూర్తికాలేదు. పనులు ముందుకు సాగకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఐటీడీఏ ద్వారా రూ. 2.50 కోట్లతో సుమారు 3 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు నిర్మించడానికి రెండేళ్ల క్రితం నిధులు మంజూరు చేశారు. ఆరంభంలో పనులు వేగవంతంగా జరిగాయి. కానీ ఆ తరువాత అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు మందగించాయి. రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర పోసి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అర్హులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి


నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న తహసీల్దార్

ఆసిఫాబాద్‌అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎలక్ట్రోరల్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కదం సురేశ్‌కుమార్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పలు పోలింగ్ స్టేషన్‌లను డిప్యూటీ తహసీల్దార్ పోచయ్యతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఈనెల 27న జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ చౌక్ వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కౌటాల: అర్హులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని ముత్తంపేట్ గ్రామంలోని బీఎల్‌వో కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కలిగి ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ లిస్ట్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని, పకడ్బందీగా ఓటర్ జాబితా ఉండాలని పేర్కొన్నారు. ఆగస్టు 27, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో చేపట్టనున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

బెజ్జూర్: మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ రోజారమణి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సర్వసభ్య సమావేశంలో అధికారులు గైర్హాజరుకావడంతో అసహనం వ్యక్తం చేశారు. వచ్చే సర్వసభ్య సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు హాజరయ్యేలా చూడాలని ఎంపీడీవో మాధవికి సూచించారు. రేంజ్ అధికారి దయాకర్ మాట్లాడుతూ మండలంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా లక్షా20వేల మొక్కలు నాటామన్నారు. 30ఎకరాల ప్లాంటేషన్ పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2017 నుంచి 2022 వరకు తునికాకు రాయల్టీ డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. గ్రామాల్లో గృహలక్ష్మి పథకానికి సంబంధించిన దరఖాస్తుల పరిశీలన జరగడం లేదని సభ్యులు పేర్కొనగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటున్నామని తహసీల్దార్ బ్రహ్మేశ్వర్ తెలిపారు. అనంతరం పెరిగిన వికలాంగుల పింఛను లబ్ధిదారులకు పింఛను డబ్బులతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, ఎంపీడీవో మాధవి, ఎంపీవో రమేశ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకుడు అశోక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి, సెప్టెంబర్ 1న తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం రద్దు, పాత పెన్షన్ విధానం అమలు, నూతన జాతీయ విద్యావిధానం రద్దు, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, డీఈవో, ఎంఈవో పోస్టుల భర్తీ, 317 జీవో టీచర్లకు సొంత జిల్లాలకు బదిలీలు, మోడల్ స్కూల్, గురుకుల, కేజీబీవీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ పోరాట కమిటీ నాయకులు లక్ష్మారెడ్డి, చరణ్‌దాస్, శ్యాముల్, శాంతి కుమారి, ఇందులాల్, ఉశన్న, సదీర్, శ్రీధర్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

### పనులు వేగవంతంగా పూర్తి చేయాలి


బోర్‌వెల్ పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

తిర్యాణి: గిరి వికాస్ పథకంలో భాగంగా చేపడుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. శనివారం మండలంలోని ఉమ్మడి పంగిడిమాదర గ్రామపంచాయతీ పరిధిలో గిరివికాస్ ద్వారా నిర్మించిన బోర్‌వెల్‌ను ఆయన పరిశీలించారు. డీఆర్‌డీవో మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిర్మిస్తున్న బోర్‌వెల్‌లను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడి ఇచ్చే పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో షాకీర్ ఉస్మాని, ఈసీ రజిత, టీఏలు సాగర్, స్వరాజ్ తదితరులు ఉన్నారు.

### సహపంక్తి భోజనంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: ఎమ్మెల్యే ప్రవాస్‌యోజనలో భాగంగా శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు నివాసంలో ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనంలో మహారాష్ట్రలోని చిమూర్ ఎమ్మెల్యే బంటి భావు భాంగ్డియా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. సాయంత్రం పట్టణంలోని నౌగాంబస్తీలో 2015లో అమరుడైన ఆర్మీ జవాన్ వసాకే సంతోష్ తల్లిదండ్రులను చిమూర్ ఎమ్మెల్యే బంటి భావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సన్మానించారు.